సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 3 । జూన్ । 2025




ఆకాశమే హద్దుగా..
కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.

II లో



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి అల్లూరి వెంకట మురళీకృష్ణంరాజు, కల్యాణి దంపతులు (మలికిపురం) రూ.1,12,116 విరాళంగా అందజేశారు.

డెల్టాలకు 500 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 కలిపి మొత్తం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 7,316 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఇసుక డ్రెడ్జింగ్ పడవలు సీజ్


సీజ్ చేసిన పడవ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ రాణి సుస్మిత

సాక్షి ఇంపాక్ట్

తాళ్లపూడి (కొవ్వూరు): ఇసుక ర్యాంపుల్లో ఇసుక డ్రెడ్జింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత హెచ్చరించారు. కొవ్వూరు గామన్ బ్రిడ్జి సమీపాన దండగొండ ర్యాంపులో రెండు ఇసుక డ్రెడ్జింగ్ పడవలను సోమవారం అధికారులు సీజ్ చేశారు. గోదావరి నదీగర్భంలో పడవలతో డ్రెడ్జింగ్ చేస్తూ యథేచ్ఛగా ఇసుక తవ్వుకుపోతూండటంపై 'కొల్లగొట్టేస్తున్నారు..' శీర్షికన గత నెల 31న 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్, ఇరిగేషన్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ర్యాంపులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. డ్రెడ్జింగ్‌కు ఉపయోగిస్తున్న రెండు బోట్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ర్యాంపులో ఉన్నవారిని ఆర్డీఓ రాణి సుస్మిత వివరాలడిగి తెలుసుకున్నారు. అయితే, ఈ పడవలు గురించి తమకు తెలియదని అక్కడి వారు చెప్పడం గమనార్హం. దండగొండ ర్యాంపులో అధికారుల దాడి నేపథ్యంలో మిగిలిన ర్యాంపుల్లో కూడా డ్రెడ్జింగ్ నిలిపివేయడం గమనార్హం.


సాక్షి
కొల్లగొట్టేస్తున్నారు


అధికారుల్లో స్పందన తెచ్చిన 'సాక్షి' కథనం

పీజీఆర్ఎస్‌కు 279 అర్జీలు


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 279 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, డీఆర్ఓ సీతారామమూర్తి తదితరులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్‌తో పాటు మీసేవా పోర్టల్, 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే అర్జీలను అంతే ప్రాధాన్యంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చిన అర్జీల్లో రెవెన్యూ 202, పోలీసు 14, ఇతర శాఖలవి 28 ఉన్నాయన్నారు. మిగిలినవి ఇతర సమస్యలపై వచ్చాయన్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 25 అర్జీలు


అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఏఎస్పీ సుబ్బరాజు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం(పీజీఆర్ఎస్)కు 25 అర్జీలు వచ్చాయి. అడిషనల్ ఎస్పీలు ఎంబీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజులు అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి, ఫిర్యాదీల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972పై విస్తృత ప్రచారం

కాకినాడ సిటీ: మత్తు పదార్థాల నివారణ, సహాయానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థ ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఫోర్స్‌మెంట్)కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తదితరులు కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు.

రహదారిపై మృత్యుఘోష


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


కారులో చిక్కుకుపోయిన మృతదేహాలు


మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అతివేగం అనర్థదాయకమని అందరికీ తెలిసిందే. కానీ, ఆచరణలో చూపుతున్న నిర్లక్ష్యం పలుచోట్ల ప్రమాదాలకు కారణమవుతోంది. వారం రోజుల క్రితం గామన్ బ్రిడ్జి హైవేపై మలుపు తిరుగుతున్న లారీని కారు ఢీకొని కొవ్వూరు ప్రాంతానికి చెందిన నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కన్నీటి తడి ఇంకా ఆరక ముందే.. రంగంపేట మండలం వడిశలేరు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదు నిండు ప్రాణాలు బలైపోయాయి.
ఈ రెండు ప్రమాదాలకూ ప్రధాన కారణం అతివేగమే కావడం బాధాకరం.

- వడిశలేరు వద్ద ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- ఐదుగురి దుర్మరణం
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- కాకినాడ వెళ్లి వస్తుండగా ఘోరం
- రెండు కుటుంబాల్లో పెను విషాదం
- అతి వేగమే బలిగొందా?

రంగంపేట/రాజానగరం/రాజమహేంద్రవరం రూరల్: అప్పటి వరకూ ఆనంద సాగరంలో ఓలలాడిన వారిని విధి చిన్నచూపు చూసింది.. కొద్దిసేపటిలో ఇంటికి చేరుకునేవారే.. అయినవారితో సంతోషంగా గడిపేవారే.. కానీ, అంతలోనే వారిపై మృత్యువు పంజా విసిరింది.. రహదారిపై మృత్యుఘోష ప్రతిధ్వనించింది.. రంగంపేట మండలం వడిశలేరు వద్ద ఏడీబీ రోడ్డుపై జరిగిన ఘోర ప్రమాదం రెండు కుటుంబాల్లో ఎప్పటికీ తీరని విషాదాన్ని నింపింది. అయినవారందరినీ శోక సంద్రంలో ముంచింది.

ఏం జరిగిందంటే..
ఈ ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు, గాయపడిన వారు దగ్గర బంధువులు. రాజానగరం మండలం రఘుదేవపురానికి చెందిన రేలంగి శివన్నారాయణ (40), ఆయన భార్య దేవీ లలిత (34), కుమార్తెలు వర్షిత (13), హర్షితతో పాటు.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కవలగొయ్యి గ్రామానికి చెందిన శివన్నారాయణ బావమరిది తీగిరెడ్డి శివ (30), ఆయన భార్య భవాని, వారి కుమార్తె సాన్వి (4) కలసి కారులో సోమవారం కాకినాడ బీచ్‌కు వెళ్లారు. అక్కడ ఆనందంగా గడిపారు. తిరిగి వస్తున్న క్రమంలో వడిశలేరు గ్రామ సమీపాన హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద వారు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న పాల ట్యాంకర్‌ను వేగంగా ఢీకొంది. ఆ వేగానికి కారు సగ భాగం ట్యాంకర్‌లోనికి చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న శివన్నారాయణ, దేవీలలిత దంపతులు, వారి కుమార్తె వర్షిత, తీగిరెడ్డి శివ, ఆయన కుమార్తె సాన్వి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వెనుక సీటులో కూర్చున్న శివ భార్య భవాని, శివన్నారాయణ కుమార్తె హర్షిత తీవ్రంగా గాయపడ్డారు. వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ప్రమాద ఘటనా ప్రాంతంలో కారు, ట్యాంకర్


తీగిరెడ్డి శివ, సాన్వి, భవాని (ఫైల్)

ఈ కుటుంబాలు కల్లు గీతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. శివ తండ్రి సూరిబాబు గత ఏడాది తాటిచెట్టు పైనుంచి పడి, మంచాన ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ ఘోరం జరగడం ఆయా కుటుంబాలను తీవ్రంగా కలచివేస్తోంది. సరదాగా బీచ్‌కు వెళ్లి వస్తామని చెప్పి వెళ్లినవారు ఇలా కనుమరుగైపోతారను కోలేదంటూ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. గర్భిణిగా ఉన్న భవానీ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదంతో రెండు గ్రామాల్లోనూ విషాదం అలముకున్నాయి.

ఆధార్ ఇబ్బందులు తొలగిపోతాయనుకుంటే..

మృతుడు శివన్నారాయణ కుమార్తెలు హర్షిత, వర్షితలు కవల పిల్లలు. 13వ సంవత్సరంలోకి వచ్చారు. ఇద్దరూ ఒకే రూపంలో ఉండటంతో ఆధార్ అయ్యేది కాదు. ఈ క్రమంలో కాకినాడలో ఇందుకు సంబంధించిన పని చేసే వారున్నారని వారికి తెలిసింది. బీచ్‌లో సరదాగా గడిపిన అనంతరం వారు హర్షిత ఆధార్ పని పూర్తి చేసుకోవాలని వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఈ కవలల్లో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఆధార్ ఇబ్బందులు తొలగిపోతాయనుకుంటే ఇలా జరిగిందంటూ వారి బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

డైవర్షన్ గమనించలేదా?
ఏడీబీ రోడ్డు నాలుగు లేన్ల విస్తరణ పనుల నేపథ్యంలో **వడిశలేరు హెచ్‌పీ** పెట్రోల్ బంకు వద్ద ట్రాఫిక్‌ను పక్క **మార్గంలోకి మళ్లించా**రు. దీనికి కొద్ది దూరంలోనే పాల **ట్యాంకర్ ఆగి ఉంది.** ప్రమాద సమయానికి శివన్నారాయణ కారు నడుపుతున్నారు. ఆయన ఆగి ఉన్న ట్యాంకర్‌ను, డైవర్షన్‌ను గమనించకుండా వేగంగా దూసుకుని రావడం వల్లనే ఈ ఘోరం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జయిపోయింది. రహదారిపై డైవర్షన్‌ను గమనించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండకపోవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎల్.అర్జున్, రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య, అనపర్తి సీఐ సుమంత్ సందర్శించారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను చూసి బంధువులు, కవలగొయ్యి, రఘునాథపురం గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వాసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. రంగంపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు దగా

- కూటమి అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగమని హామీ
- లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రగల్భాలు
- గద్దెనెక్కాక హామీల విస్మరణ
- ఉద్యోగమూ లేదు.. భృతీ లేదు
- మెగా డీఎస్సీ పేరుతో నయవంచన



సాక్షి, రాజమహేంద్రవరం: 'అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలిస్తాం. లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తాం తమ్ముళ్లూ' అంటూ విపక్ష నేతగా చంద్రబాబు గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఊరూ వాడా ఊదరగొట్టారు. నాడు కూటమి రూపొందించిన సూపర్ సిక్స్ హామీల్లో ఈ హామీని మొదటి స్థానంలో పెట్టింది. జిల్లాలోని నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించి ఆదుకుంటానని జిల్లా పర్యటనల సందర్భంగా నాడు చంద్రబాబు గొప్పగా చెప్పారు. తీరా చూస్తే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇటు ఉద్యోగం.. అటు భృతి ఇవ్వకుండా దగా చేశారని యువత మండిపడుతోంది.

'తూర్పు'లో ఇలా..
జిల్లావ్యాప్తంగా 5,09,611 కుటుంబాలున్నాయి. జనాభా 18,32,332. ఏటా జూనియర్ కళాశాలల్లో 3 వేల మంది, డిగ్రీ కళాశాలల్లో 8 వేల మంది, బీటెక్, ఎంటెక్, డిప్లొమా కోర్సులలో మరో 2 వేల మంది కలిపి మొత్తం 13 వేల మంది ఉత్తీర్ణులవుతున్నారు. వీరిలో కొందరు ఉద్యోగాలు చేస్తున్నా.. మరి కొందరు ఖాళీగా ఉంటున్నారు. ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరైనా నిరుద్యోగి ఉంటున్నారని అంచనా. ఈ లెక్క ప్రకారం కూటమి ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 5.09 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలి లేదా నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి. ఎన్నికల హామీ ప్రకారం వీరికి ప్రతి నెలా సుమారు రూ.152 కోట్ల మేర నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగాలు వచ్చేస్తాయని నమ్మి డిగ్రీ, ఇంటర్, పదో తరగతి చదివిన విద్యార్థులు ఉద్యోగాల సాధనపై దృష్టి సారించారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపేందుకు కోచింగ్ సెంటర్ల బాట పట్టారు. రూ.వేలల్లో ఫీజులు చెల్లించి మరీ శిక్షణ పొందుతున్నారు. కూటమి నేతల హామీలు నమ్మి మోసపోయామని వీరందరూ ఇప్పుడు ఆవేదన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1,008 ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 650కి పైగా ఉపాధ్యాయ ఖాళీలున్నట్లు గతంలో అధికారులు లెక్కలు తీశారు. అయితే 2025 డిసెంబర్ నాటికి ఏర్పడే ఖాళీలను అనుసరించి డీఎస్సీ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్పిందే తప్ప దీనిపై ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వలేదు.

శాశ్వత ఉద్యోగాలు కల్పించిన జగన్
గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా 512 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారు. 5,120 మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. ప్రస్తుతం వీరిలో 3,158 మంది పని చేస్తున్నారు. మిగిలిన వారు బదిలీలు తదితర ప్రక్రియల్లో ఉన్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున 9,579 మందికి గ్రామ, వార్డు వలంటీర్లను నియమించి, తాత్కాలిక ఉపాధి కల్పించారు. వైద్య, ఆరోగ్య శాఖలో జీరో వేకెన్సీ ప్రాతిపదికన జిల్లావ్యాప్తంగా 4 వేలకు పైగా శాశ్వత ఉద్యోగాలు భర్తీ చేశారు. శాశ్వత, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో వేలాది మందికి ఉద్యోగాలు కల్పించారు. యువత ఉద్యోగాలు పొందేందుకు వీలుగా ప్రతి నియోజకవర్గంలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అందజేశారు.

మోసమే బాబు నైజం



ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించడం సీఎం చంద్రబాబు నైజం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఏడాది అవుతున్నా ఇచ్చిన దాఖలాలు లేవు. జాబు రావాలంటే బాబు రావాలి, నిరుద్యోగ భృతి పేరుతో 2014లో అధికారంలోకి వచ్చిన బాబు.. ఆ ఐదేళ్లూ నయా పైసా కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను వంచించారు. ఇప్పుడు కూడా అదే పని చేస్తున్నారు.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

యువతకు అన్యాయం



యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. ఉపాధి కల్పించకపోగా.. ఉన్న అవకాశాలు దూరం చేస్తోంది. వలంటీర్లను తొలగించి వారి కుటుంబాలను రోడ్డు పాలు చేసింది. జాబ్ క్యాలెండర్ ప్రకటన లేదు. విద్యార్థులకు, యువతకు కూటమి ప్రభుత్వం ఏ ఒక్క పథకమూ అమలు చేయడం లేదు. ఉద్యోగ ప్రకటన వస్తుందని వేలాది మంది కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తుందో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు.

– తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త

ఘనంగా జన్మనక్షత్ర పూజలు


సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని స్వామి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 2 గంటలకు ఆలయం తెరచి స్వామి, అమ్మవార్లకు అర్చకులు సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్‌లకు, శివలింగానికి పంచామృతాలతో మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధభరిత పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. యాగశాలలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ సత్యదేవుడు, అమ్మవార్లకు ఆయుష్య హోమం నిర్వహించారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుడు, అమ్మవారు, శంకరులను ముత్యాల కవచాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పోరాట పటిమ కార్యకర్తల సొంతం

- వారి కోసమే పార్టీ బాధ్యతలు తీసుకున్నా
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి
- వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

మలికిపురం: ప్రజా సమస్యలపై ఎటువంటి పోరాటానికైనా జెండా పట్టుకుని ముందుండేది ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మాత్రమేనని, అటువంటి పోరాట పటిమ తమ కార్యకర్తలకే సొంతమని పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ మలికిపురంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ, నాడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ అనే విత్తనం వేస్తే, దానిని మానుగా మార్చింది కార్యకర్తలేనని స్పష్టం చేశారు. ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కొనైనా పార్టీని సగర్వంగా నిలిపిన కార్యకర్తలను ఎల్లప్పుడూ కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. తమ పార్టీ స్థాపించిన సమయంలో అన్ని రాజకీయ పార్టీలు తమకు తీవ్ర వ్యతిరేకంగానే ఉన్నాయని గుర్తు చేశారు. కార్యకర్తల కోసమే తాను పార్టీ జిల్లా బాధ్యతలు స్వీకరించానన్నారు. రాష్ట్రంలో కూటమి అరాచక పాలన నడుస్తోందని దుయ్యబట్టారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకూ శత్రువులకు కూడా ప్రభుత్వ పథకాలను అందించిన ఘనత తమదని, దానికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ వాళ్లకు పథకాలు ఇవ్వొద్దని నేరుగా కూటమి పెద్దలే చెప్పడం దారుణమన్నారు. రాష్ట్రంలో పనిచేసి ఓడిన సీఎం ఎవరైనా ఉన్నారంటే అది తమ అధినేత మాత్రమేనని జగ్గిరెడ్డి అన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జెడ్పీటీసీ సభ్యులు బళ్ల ప్రసన్నకుమారి, కుసుమ వనజకుమారి తదితరులు పాల్గొన్నారు.


మలికిపురం సభలో మాట్లాడుతున్న చిర్ల జగ్గిరెడ్డి. చిత్రంలో గొల్లపల్లి సూర్యారావు తదితరులు

నడిరోడ్డుపై పోలీసుల థర్డ్ డిగ్రీ

- రెడ్ బుక్ రాజ్యాంగానికిదే నిదర్శనం
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తెనాలిలో నడిరోడ్డుపై యువకులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడమే ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగానికి నిదర్శనమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను రాజమహేంద్రవరం వీఎల్ పురంలోని మార్గాని ఎస్టేట్స్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇది రెడ్ బుక్కా... బ్లడ్ బుక్కా అని జాతీయ మీడియాలో ఏపీ గురించి అడుగుతున్నారని అన్నారు. నేరం చేసిన వారిని శిక్షించడానికి న్యాయస్థానాలుండగా, పోలీసులే ఇలా వ్యవహరిస్తే ఇక ప్రజాస్వామ్యం ఉన్నట్టా లేనట్టా అని నిలదీశారు. తెనాలిలో యువకులను పోలీసులు విచక్షణారహితంగా లాఠీలతో కొట్టిన ఘటన మరువక ముందే అదే పట్టణంలో ఒక గోల్డ్ స్మిత్ కూడా వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు దారుణంగా ఉన్నాయన్నారు. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడమేమిటని, అలాగైతే ఇక కోర్టులెందుకని భరత్‌రామ్ ప్రశ్నించారు. నిజంగా తప్పు చేస్తే కోర్టులో నిరూపించి, అవసరమైతే ఉరి శిక్ష వేయవచ్చని, అంతే కానీ, ఇలా రోడ్డు మీద చిత్రవధ చేయడమేమిటని నిలదీశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మార్గాని భరత్‌రామ్

డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి..
ఇవ్వక ఇవ్వక ఇన్నాళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని, ఐదు లక్షల మంది పరీక్షలు రాయబోతున్నారని, వారు కనీసం 90 రోజుల సమయం అడిగితే, 40 రోజుల్లోనే పరీక్ష పెట్టేస్తే ఎలాగని భరత్‌రామ్ ప్రశ్నించారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఆశావహులు ఏదో ఒక పని చేసుకుంటూ ఉంటారని, సమయం ఇవ్వకపోతే వారు పరీక్షలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. డీఎస్సీ అభ్యర్థులకు మూడు నెలల సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు అంటూ ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా అమలు చేయకపోవడంతో ఏ వర్గం ప్రజలూ సంతోషంగా లేరని అన్నారు. ప్రజలను నమ్మించి, వంచించి అధికారం పీఠం ఎక్కారని విమర్శించారు. అందుకే జూన్ 4న వెన్నుపోటు దినంగా నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని ఆయన చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ ఆందోళనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆకాశమే హద్దుగా..

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌-2025 ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విశేష ప్రతిభ
- జిల్లా విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు
- మరిన్ని విజయాలు సాధిస్తామంటున్న ర్యాంకర్లు

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాలలో జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. చదువులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తూ.. ముందుకు దూసుకుపోతామని ఆత్మవిశ్వాసం చూపుతున్నారు. ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి.. తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటామని అంటున్నారు. వారి మాటల్లోనే..

రాజమహేంద్రవరం రూరల్‌



పేరు: కంచుమర్తి ప్రణీత్‌, రాజమండ్రి
ర్యాంకు: 2 (ఎస్సీ కేటగిరీ), 311(ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: ప్రతాప్‌జీవన్‌, ఏడీ, అగ్రికల్చర్‌
తల్లి: మీనా, ఏవో, అగ్రికల్చర్‌
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి సాఫ్ట్‌వేర్‌ ఇంజినీరవుతా.



పేరు: దువ్వి ఆశిష్‌ సాయి శ్రీకర్‌, రాజమండ్రి
ర్యాంకు: 371 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: డాక్టర్‌ దువ్వి శ్యామ్‌ కిరణ్‌, వైద్యులు
తల్లి: డాక్టర్‌ నీలపాల పద్మజ, వైద్యులు
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ అవుతా.



పేరు: కోడూరి యశ్వంత్‌ రామ్‌, మానేపల్లి
ర్యాంకు: 480 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: నాగ వెంకటరత్నం, ప్రభుత్వ టీచర్‌
తల్లి: సత్యవేణి, గృహిణి
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ అవుతా.



పేరు: కోటిపల్లి యశ్వంత్‌ సాత్విక్‌, పాలకొల్లు
ర్యాంకు: 8(ఈడబ్ల్యూఎస్‌), 113(ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: వెంకటసత్యనారాయణ, ఫ్రూట్స్‌ బిజినెస్‌
తల్లి: గీతావాణి, గృహిణి
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదువుతా.



పేరు: ద్వామాడ హర్షవర్ధన్‌, రాజమండ్రి
ర్యాంకు: 368 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: వీరవెంకట సత్యనారాయణ, జీఎంఆర్‌ ఇంజినీర్‌
తల్లి: రత్నకుమారి, గృహిణి
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదువుతా.



పేరు: యార్లగడ్డ దేవీష్‌రుత్విక్‌, రాజమండ్రి
ర్యాంకు: 577 (ఓపెన్‌ కేటగిరీ)
తండ్రి: డాక్టర్‌ సురేష్‌, వైద్యులు
తల్లి: డాక్టర్‌ తనూజాదేవి, వైద్యులు
లక్ష్యం: ఐఐటీలో కంప్యూటర్‌ ఇంజినీరింగ్‌ చదివి ఎంటర్‌ప్రెన్యూర్‌ అవుతా.

సత్తా చాటిన అన్నదమ్ములు



కొడవాటి రామ్‌ ప్రత్యూష్‌

కె.గంగవరం: ప్రముఖ ఐఐటీల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో కె.గంగవరానికి చెందిన కొడవటి ప్రసాద్‌చౌదరి (విశ్రాంత ఉపాధ్యాయుడు) మనవడు సువర్ణ రామ్‌ప్రత్యూష్‌కు అత్యుత్తమమైన ఆలిండియా 510 ర్యాంక్‌ సాధించినట్టు కుటుంబ సభ్యులు సోమవారం విలేకరులకు తెలిపారు. గతేడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో అతని అన్నయ్య కొడవటి సాయిప్రణీత్‌ ఆలిండియా 565 ర్యాంక్‌ సాధించడం గమనార్హం. తమ ఇద్దరు కుమారులు ప్రఖ్యాత ఐఐటీ కాలేజీల్లో సీట్లు సాధించడంపై తండ్రి కొడవటి సురేష్‌ (డీఈ, ఏపీ ట్రాన్స్‌కో), తల్లి వసుధ (సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌)తో పాటు, తాతయ్య కొడవటి ప్రసాద్‌చౌదరి, సుశీల, ఇతర కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యూష్‌ మీడియాతో మాట్లాడుతూ, ప్రతి వారం పరీక్ష రాసి, పొరపాట్లు సరిదిద్దుకోవటం, సందేహాల నివృత్తి, సమయ పాలన, రోజుకు 14 గంటలు శ్రమించడం వంటివి తన విజయానికి ప్రధాన కారణాలుగా తెలిపారు.

కరుణకు ఆలిండియా నాలుగో ర్యాంక్‌



దామలంక కరుణ

బాలాజీచెరువు (కాకినాడ): నగరానికి చెందిన దామలంక కరుణ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా రిజర్వ్‌ కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐఐటీ ముంబైలో సీఎస్‌ఈ అభ్యసించాలనేది తన లక్ష్యమని పేర్కొంది. ఆలిండియా రిజర్వ్‌ కేటగిరీలో నాలుగో ర్యాంక్‌ సాధించడం సంతోషంగా ఉందని చెప్పింది. ఇంటర్మీడియెట్‌లో రెగ్యులర్‌ సిలబస్‌తో పాటు, ఈ పరీక్షకు సంబంధించి ప్రతిరోజు సమయం కేటాయించి సాధన చేయడం తన విజయానికి కారణమని తెలిపింది. ఆమె తండ్రి సుబ్బారావు వ్యవసాయం చేస్తుండగా, తల్లి మంగాదేవి గృహిణి.

రైతు బిడ్డకు 1911 ర్యాంకు

ఆలమూరు: మండలంలోని చెముడులంకకు చెందిన రైతు బిడ్డ నాగిరెడ్డి తేజ చంద్రనారాయణ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా 1911 ర్యాంకు సాధించాడు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్‌ చదివిన అతడు ఇంటి వద్దే స్వీయ శిక్షణ పొందాడు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్‌ ఇంజినీరింగ్‌ చదివి, అత్యున్నత ఉద్యోగం సాధించేందుకు కృషి చేస్తానని అతను తెలిపాడు. ఇదే కుటుంబంలో తేజ చంద్రనారాయణ సోదరి శ్రావణి 2022లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1800వ ర్యాంకును సాధించి, ప్రస్తుతం మద్రాసు ఐఐటీలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సరస్వతీ కటాక్షం కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాసు, నాగ అరుణ దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.



చంద్రనారాయణతో కుటుంబ సభ్యులు

శృంగవృక్షం విద్యార్థికి 276వ ర్యాంకు



శంకర్‌ మాణిక్‌

తొండంగి: జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షలో శృంగవృక్షానికి చెందిన కొంజెర్ల శంకర్‌మాణిక్‌ 276 ర్యాంకు సాధించాడు. రాజమండ్రిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న మాణిక్‌ ఉత్తమ ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు. ముంబై ఐఐటీలో చేరుతానని శంకర్‌ మాణిక్‌ తెలిపాడు.

క్లుప్తంగా

బైక్‌లు ఢీకొని యువకుడి మృతి



ఆరుగొల్లు పండు (ఫైల్‌)

నిడదవోలు రూరల్‌: కోరుమామిడి గ్రామంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎల్‌.బాలాజీ సుందరరావు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు, కోరుమామిడి గ్రామానికి చెందిన ఆరుగొల్లు చంద్రరావు కుమారుడు పండు(21) గేదెల వ్యాపారం చేస్తుంటాడు. సోమవారం మధ్యాహ్నం నిడదవోలు నుంచి బైక్‌పై ఇంటికి వెళుతుండగా, ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి పిట్టా సందీప్‌ కోరుమామిడి కంచాలమ్మ అమ్మవారి గుడి సమీపంలో పండును వేగంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన పండును నిడదవోలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ మేరకు అతడి తండ్రి చంద్రరావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు జమ

- దేవస్థానం అధికారుల ఒత్తిడితో కాంట్రాక్టర్‌ చెల్లింపు
- ఊపిరి పీల్చుకున్న 349 మంది సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్‌

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 349 మంది పారిశుధ్య సిబ్బందికి ఏప్రిల్‌ నెల వేతనాలు ఎట్టకేలకు చెల్లించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సిబ్బంది ఖాతాలకు సొమ్ము జమ అయింది. మే నెల గడిచినా ఏప్రిల్‌ వేతనాలను పారిశుధ్య సిబ్బందికి చెల్లించకపోవడంపై ‘వీరి కష్టం తుడిచే వారేరి’ శీర్షికన మే 26న వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన దేవస్థానం అధికారులు మే 28న సంబంధిత కనకదుర్గా ఏజెన్సీస్‌ కాంట్రాక్టర్‌కు జీతాలు చెల్లించేందుకు రూ.58 లక్షలు చెల్లించారు. మరో రూ.లక్ష తనకు రావాల్సి ఉందని, అది వస్తే కానీ తాను జీతాలు చెల్లించనంటూ కాంట్రాక్టర్‌ భీష్మించడంతో.. కార్మికుల వేతనాలు మరింత ఆలస్యమయ్యాయి. దీనిపై ‘ఇలాగైతే మేమెలా బతకాలి’ శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది.

అధికారుల ఒత్తిడి

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంపై దేవస్థానం అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో ఆదివారమే కార్మికుల అకౌంట్లకు వేతనాలు జమ కావాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేయడంతో.. గత్యంతరం లేక ఆదివారం రాత్రి 11 నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు సిబ్బంది అకౌంట్లలో నగదు జమ అయింది. వరుసగా రెండు నెలల జీతాలు ఆలస్యం కావడంపై దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. మే నెల జీతాలైనా జూన్‌ పది కల్లా చెల్లించేలా చూడాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు.



ఆదివారం సాక్షిలో ప్రచురితమైన వార్త

నలుగురికి అందని వేతనాలు

కాగా, దేవస్థానంలో నలుగురు పారిశుధ్య కార్మికులకు మార్చి వేతనాలు ఇంకా చెల్లించలేదు. గత నెలలో అందరికీ మార్చి వేతనాలు చెల్లించగా, వీరికి అందలేదు. సాంకేతిక కారణాలతో జమ కాలేదని, వచ్చే నెల చెల్లిస్తామని చెప్పినట్లు వారు తెలిపారు. వీరికి మార్చి బకాయి చెల్లించకుండా, ఏప్రిల్‌ వేతనాలు మాత్రమే చెల్లించారు.

కడతేరి.. కన్నీరు మిగిల్చి..

- కోనేటిలో మునిగి కొడుకు, మనవడు మృతి
- తల్లడిల్లిన వృద్ధ దంపతుల కన్నపేగు
- తండ్రీకొడుకుల మృతితో బొర్రంపాలెంలో విషాదం

గండేపల్లి: వృద్ధాప్యంలో తోడుగా ఉంటాడనుకున్న కొడుకు, మనవడు మృత్యువాత పడడం ఆ ముసలి దంపతులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. కన్న కొడుకు, మనవడు ఒకేసారి దూరమవడంతో ఆ కన్నపేగు తల్లడిల్లింది. ఒకే కుటుంబంలో ఇద్దరు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొర్రంపాలేనికి చెందిన సాగి శ్రీరామమూర్తి (బూరయ్య), నాగరత్నం దంపతులకు కొడుకు నల్లబాబు(46), కుమార్తెలు సీతఆదిలక్ష్మి, సుగుణ ఉన్నారు. వీరికి వివాహాలు కాగా, నల్లబాబు వ్యాపారం కోసం భార్య నాగతులసి, కుమారుడు సంజయ్‌ శ్రీరామ్‌(19), కుమార్తె సరస్వతితో హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సరస్వతి ఈ ఏడాది టెన్త్‌ పరీక్షలు రాసింది. ఇటీవల కాలంలో నల్లబాబు ఒంటరిగా సొంతూరు వచ్చి తల్లిదండ్రులకు తోడుగా ఉంటూ, వ్యవసాయం చేస్తున్నాడు. సంజయ్‌ శ్రీరామ్‌ చదువు కోసం విశాఖపట్నంలో ఉంటున్నాడు. ఇటీవల అతడు ఇంటికి వచ్చాడు. కాగా సోమవారం వలసపాకల గ్రామానికి పరామర్శకు వెళ్లిన నల్లబాబు, సంజయ్‌ శ్రీరామ్‌ మైలు శుద్ధి స్నానానికి సాయంత్రం తాళ్లూరు వచ్చారు. కోనేరులో దిగిన సంజయ్‌ శ్రీరామ్‌ మునిగిపోతుండగా నల్లబాబు రక్షించేందుకు యత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీట మునిగి మృతి చెందారు. ఆ సమయంలో ఎవరూ గుర్తించకపోవడంతో కాపాడేందుకు వీల్లేకుండా పోయిందని స్థానికులు అంటున్నారు.



కోనేరు వద్ద తండ్రీకొడుకుల మృతదేహాలు

తల్లి వద్దకు వెళ్లాల్సి ఉండగా..

హైదరాబాద్‌లో ఇంటర్‌ పూర్తి చేసిన సంజయ్‌ శ్రీరామ్‌ విశాఖపట్నంలో హాస్టల్‌లో ఉంటూ, రఘు ఇంజినీరింగ్‌ కాలేజ్‌లో బీటెక్‌ సెకండియర్‌ చదువుతున్నాడు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ఉన్న తల్లి, చెల్లి వద్దకు వెళ్లాల్సి ఉందని, ఇంతలోనే ఇలా జరిగిపోయిందని బంధువులు, స్నేహితులు వాపోయారు. మృదుస్వభావి, సౌమ్యుడు, అందరితో కలిసిమెలిసి ఉండే నల్లబాబు ఇలా దూరం కావడం బాధాకరంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చదువు, ఇల్లు తప్ప వేరే ధ్యాస లేని సంజయ్‌ చిన్న వయస్సులోనే దూరమయ్యాడని స్నేహితులు వాపోయారు. బొర్రంపాలెం గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో కోనేరు నుంచి మృతదేహాలను వెలికితీశారు. సంఘటనా స్థలాన్ని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వృద్ధాప్యంలో ఉన్న నల్లబాబు తండ్రిని ఓదారుస్తున్న బంధువులు

కడసారి చూపు కోసం..

కొడుకు, మనవడు ఒకేసారి శాశ్వతంగా దూరమవ్వడంతో కదల్లేని స్థితిలో ఉన్న శ్రీరామమూర్తి, నాగరత్నం వద్దకు అంబులెన్స్‌లో మృతదేహాలను బొర్రంపాలెం తీసుకువెళ్లారు. కొడుకు, మనవడిని చూసి ఆ వృద్ధ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సంఘటన గ్రామస్తులను కంటతడి పెట్టించింది. తమ్ముడూ.. అప్పుడే నీకు నూరేళ్లూ నిండాయా.. నన్ను అక్క అని ఎవరు పిలుస్తారురా.. నన్ను అత్తా అని ఎవరు పిలుస్తారురా...అంటూ మృతదేహాలను పట్టుకుని సుగుణ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

చిరంజీవిని కుమారి మృతికి ప్రముఖుల సంతాపం

వైద్య కళాశాలకు భౌతికదేహం అందజేత

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రముఖ విద్యావేత్త డాక్టర్‌ పి.చిరంజీవిని కుమారి భౌతికదేహాన్ని సోమవారం పలువురు ప్రముఖులు సందర్శించారు. అభిమానులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ప్రతాప్‌నగర్‌లోని ఆమె స్వగృహం నుంచి ఇంద్రపాలెం లాకుల వద్దనున్న ఐడియల్‌ కళాశాలకు ఉదయం 11 గంటలకు తీసుకువచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఆమె భౌతికకాయాన్ని రంగరాయ వైద్య కళాశాలకు ఊరేగింపుగా తీసుకెళ్లి అందజేశారు. ఆమెకు సంతాపం తెలిపిన వారిలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, మాజీ వీసీలు డాక్టర్‌ జీవీఆర్‌ ప్రసాదరాజు, కె.పద్మరాజు, మురళీకృష్ణ, ప్రగతి విద్యా సంస్థల చైర్మన్‌ పి.కృష్ణారావు, మాజీ రిజిస్ట్రార్‌ వి.రవీంద్ర, కుడా మాజీ చైర్మన్‌ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సీపోర్టు సీఈఓ మురళీధర్‌, జెడ్పీ చైర్మన్‌ దున్నా జనార్దనరావు, పూర్వ విద్యార్థులు, సాహిత్యాభిమానులు ఉన్నారు.



చిరంజీవిని కుమారి భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న వేణుగోపాలకృష్ణ



మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎంపీ వంగా గీత శ్రద్ధాంజలి

ధాన్యం వ్యాపారి పరారీ!

ప్రత్తిపాడు రూరల్‌: తమ ధాన్యం సొమ్ము తీసుకుని ఓ వ్యాపారి పరారయ్యాడని మండలంలోని ధర్మవరం జువ్వల రామాలయం వద్ద సోమవారం పలువురు ధాన్యం రైతులు ఆందోళన చేపట్టారు.

వారు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన 26 మంది రైతుల వద్ద నుంచి రూ.27 లక్షల విలువైన 2,900 బస్తాల ధాన్యాన్ని గ్రామానికి చెందిన నక్కంటి శ్రావణ్‌కుమార్‌ కొనుగోలు చేసినట్టు చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా తమ సొమ్ము చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీషిర్డీసాయి విజయభేరి



శ్రీసాయి హిమ్నీష్‌

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రతిష్టాత్మకమైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో శ్రీషిర్డీసాయి జూనియర్‌ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్‌ టి.శ్రీవిద్య సోమవారం తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీకి చెందిన ఐ.శ్రీసాయి హిమ్నీష్‌ జాతీయ స్థాయి 18వ ర్యాంకు సాధించగా, సీహెచ్‌ మోక్షిత్‌ 594, మోహన్‌ శ్రీరామ్‌జీ 685, మోహిత్‌ సత్యరాజ్‌ కిరణ్‌ 695 ర్యాంకులను కైవసం చేసుకున్నారన్నారు. మొత్తం నలుగురు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు సాధించారన్నారు. 12 మంది మూడు వేల లోపు, 25 మంది ఐదువేల లోపు, 32 మంది పదివేలలోపు ర్యాంకులు సాధించారన్నారు. విద్యాసంస్థల చైర్మన్‌ తంబాబత్తుల శ్రీధర్‌ మాట్లాడుతూ ప్రతి ఏటా తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ప్రముఖ ఐఐటీ, ఎన్‌ఐటీ, ట్రిపుల్‌ ఐటీల్లో సీట్లు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని చైర్మన్‌ శ్రీధర్‌, డైరెక్టర్‌ శ్రీవిద్య, లక్ష్యా అకాడమీ డీన్‌ చంద్రశేఖర్‌ అభినందించారు.

తిరుమల విద్యార్థుల ప్రభంజనం



అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్‌: ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్‌ మెడికల్‌ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్‌ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్‌ రెండో ర్యాంకు, కె.యశ్వంత్‌ సాత్విక్‌ ఎనిమిది, ఇ.వర్షిత్‌ 12, ఎం.సుమంత్‌దొర 38, కె.అభినవ్‌ 42, జి.సుజోష్‌రాజ 43, జి.అఖిల్‌సాయి 45, తుమాటిపూజిత అఖిల్‌ రాజ్‌కుమార్‌ 85, కప్పల వెంకటరామవినీష్‌ 127, పాతపాటి వెంకటవివేక్‌వర్మ 132, మువ్వల లిఖిత 137 ర్యాంకులు సాధించారని వివరించారు. ఇంకా 165, 174, 193, 195, 231, 238, 246, 270, 275, 276 ర్యాంకులు సాధించారన్నారు. వెయ్యిలోపు 69, మూడు వేలలోపు 201, ఐదు వేలలోపు 333, పది వేలలోపు 456 మంది ర్యాంకులు సాధించారని చెప్పారు. 260 మంది పైన విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించగలరని తెలిపారు. ర్యాంకర్లను తిరుమలరావు, అకడమిక్‌ డైరెక్టర్‌ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్‌ వి.శ్రీహరి అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం అదృశ్యం



భార్యాబిడ్డలతో తేజనవీన్‌

పెరవలి: వ్యాపారం కలసిరాక, అప్పులు తీర్చలేక, అప్పు ఇచ్చినవారి ఒత్తిడి తట్టుకోలేక ఓ కుటుంబం అదృశ్యమైన సంఘటన సంచలనం కలిగించింది. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముత్యాలవారిపాలెం గ్రామానికి చెందిన గంటా తేజనవీన్‌ తణుకులో గిఫ్ట్‌ ఆర్టికల్స్‌ షాపు నిర్వహించేవాడు. వ్యాపార, కుటుంబ అవసరాల కోసం రూ.25 లక్షలు అప్పులు చేశాడు. అప్పు ఇచ్చినవారు బాకీ తీర్చమని ఒత్తిడి చేయసాగారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం కుటుంబం సహా బయటకు వెళ్లిన తేజనవీన్‌ తిరిగి ఇంటికి చేరలేదు. ఈ మేరకు తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. తేజనవీన్‌, అతని కుటుంబ సభ్యులు కనిపిస్తే తమకు 94407 96642 లేదా 91548 75611 నంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?


నేడు వరల్డ్ సైకిల్ డే



మొదటి వాహనముకు వందనం!

సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఏ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సింది. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది.

అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజీ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేప్పొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...


కరణ్



బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్–ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్–బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్–బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలొకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్–జోన్ నోటిఫైయర్. ఇది హై–రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. ఢిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్

జూన్ 2న ముగింపు రూ.లలో
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

మనసు నీకై రథమయ్యే రారా...


• కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్‌పై ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'విశ్వద నాయక...' అంటూ సాగే నాలుగో పాటని విడుదల చేశారు. 'విశ్వద నాయక.. విహిత వీరా... మనసు నీకై.. రథమయ్యే రారా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఈ పాటలో కమల్‌హాసన్ క్యారెక్టర్ నేచర్, అభిరామి, త్రిష పాత్రల్లోని డైనమిక్స్‌ని లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రశాంత్ వెంకట్ రాసిన ర్యాప్ ఈ పాటకు మరో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. అలెగ్జాండ్రా జాయ్ వండర్ ఫుల్ వోకల్స్ ఎమోషన్‌ని నావిగేట్ చేయగా, ఏఆర్ అమీన్ ర్యాప్ ఎనర్జీని మరింతగా పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది.

కుబేర ప్రేక్షకులకి నచ్చుతుంది

– నాగార్జున


• నాగార్జున, ధనుష్

''చెన్నై ప్రేక్షకుల నుండి సంవత్సరాలుగా నాకు లభించిన ప్రేమకు కృతజ్ఞతలు. 'కుబేర'ని శేఖర్‌గారు అద్భుతంగా తీశారు. ఈ చిత్రం ప్రేక్షకులకి కచ్చితంగా నచ్చుతుంది. ఈ మూవీ తర్వాత రజనీకాంత్ గారి 'కూలీ' సినిమా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి రెడీగా ఉంది'' అని హీరో నాగార్జున అక్కినేని తెలిపారు. ధనుష్, నాగార్జున హీరోలుగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'కుబేర' ఆడియో లాంచ్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ–''కుబేర' కోసం తిరుపతిలో ఎండలో చెప్పులు లేకుండా, చిరిగిన బట్టలతో బిచ్చగాడిగా నటించడం మరచిపోలేను. ఆ అనుభవం జీవితంలోని ముఖ్యమైన సత్యాలను గుర్తు చేసింది'' అన్నారు. ''కుబేర' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా'' అన్నారు రష్మికా మందన్నా. ''ధనుష్, నాగార్జునగారి నటన మెస్మరైజింగ్‌గా ఉంటుంది'' అని శేఖర్ కమ్ముల తెలిపారు. ''సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.. గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కూర్ రామ్‌మోహన్ రావు, సునీల్ నారంగ్. ఈ కార్యక్రమంలో దేవి శ్రీ ప్రసాద్, నిర్మాతలు జాన్వీ నారంగ్, భరత్ నారంగ్, సిమ్రాన్ నారంగ్, కెమేరామేన్ నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, లిరిక్ రైటర్స్ వివేక, చంద్రబోస్, నంద కిషోర్ పాల్గొన్నారు.


• 'ఘాటి' పోస్టర్

జూలైలో ఘాటి

హీరోయిన్ అనుష్కాశెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'ఘాటి'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు మరో లీడ్ రోల్ చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమాని జూలై 11న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న 'ఘాటి' సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందించగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. వ్యాపార రంగంలో పైస్థాయికి వెళ్లాలనుకునే ఓ మహిళను కొందరు మోసం చేస్తారు. దీంతో ఆ మహిళ వారికి తగిన బుద్ధి చెప్పి, వ్యాపారంలో అత్యున్నత స్థాయికి ఎలా చేరుకుంటారు? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని టాక్.

దీపావళికి తెలుసు కదా


• సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా, వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 17న రిలీజ్ చేయనున్నట్లు సోమవారం మేకర్స్ ప్రకటించారు. ''మనసును తాకేలా, ఊహించని మలుపులతో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నాన్న అంటేనే దైవం


• పృథ్వీ అంబర్, సాయికుమార్

''నాన్న అంటేనే మొదటి దైవం.. తను పోసిన ప్రాణమిది.. నాన్న అనగానే వాలే నీ ముందు.. అలుపెరుగని ప్రాణమిది.. మన కొరకే బతికే ప్రాణం.. మన బాధ్యత ఒకటే ధ్యానం'' అంటూ సాగుతుంది 'చౌకీదార్' సినిమాలోని 'నాన్న' యాంథమ్ పాట లిరికల్ వీడియో. పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా, సాయికుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'చౌకీదార్'. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో డా. కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మించారు. సచిన్ బస్రూర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాన్న..' పాటను విడుదల చేశారు. ఈ పాటకు సంతోష్ వెంకీ సాహిత్యం అందించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

తెలంగాణ కళాకారులకు అన్యాయం జరిగింది

– ప్రతాని రామకృష్ణగౌడ్


• అమృత్ గౌడ్, రమేశ్ నాయుడు, ప్రతాని రామకృష్ణ, కిరణ్

''తెలంగాణ ప్రభుత్వం గద్దర్‌గారి పేరుతో అవార్డ్స్ ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే ఈ అవార్డు కమిటీ జ్యూరీకి మురళీ మోహన్, జయసుధలను చైర్మన్లుగా నియమించడం ఏంటో అర్థం కాలేదు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'దిల్' రాజు తన అధికారాలను దుర్వినియోగం చేశారు. తన వాళ్లకే అవార్డ్స్ ఇచ్చుకున్నారు. జ్యూరీ కమిటీలో ఉన్నవాళ్ల సినిమాలకు అవార్డ్స్ ఇవ్వకూడదనే నిబంధనలను పాటించ లేదు. థియేటర్స్ బంద్ విషయంలోనూ 'దిల్' రాజు ప్రమేయం ఉంది'' అని 'తెలంగాణ ఫిలిం చాంబర్' చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. జ్యూరీ కమిటీ సభ్యులు అన్ని సినిమాలు చూడలేదు. థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం వల్ల గతంలో లాభాలు ఆర్జించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రస్తుత విధానాల వల్ల నష్టాలు వస్తున్నాయి. 2002 వరకు థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత నిర్మాత డి. సురేష్ బాబులాంటి కొందరు తమ స్వార్థంతో అద్దె విధానాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, ఏషియన్ సునీల్.. లాంటి వాళ్లు సురేష్ బాబు బాటలోనే నడిచి థియేటర్స్‌ను తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు'' అన్నారు. ''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లను ప్రభుత్వం పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది'' అన్నారు టీఎఫ్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, నటుడు కిరణ్, తెలంగాణ డైరెక్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, తెలంగాణ రైటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ అమృత్ గౌడ్ కోరారు.

క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు

– రూపేశ్


• పవన్ ప్రభ, రాజేంద్ర ప్రసాద్, రూపేశ్

''షష్టిపూర్తి' అనేది కల్చరల్ బ్లాక్ బస్టర్ కాదు.. కల్ట్ బ్లాక్ బస్టర్. 'పెళ్లి పుస్తకం' చిత్రం నుంచి 'షష్టిపూర్తి' వరకు ఏ నటుడికి దక్కని సినిమా ప్రయాణం నాకు దక్కింది. 'షష్టిపూర్తి' చూస్తూ ప్రేక్షకులు ఏడ్చేస్తున్నారంటేనే మేం విజయం సాధించినట్టు'' అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్షా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్ నిర్మించిన ఈ సినిమా మే 30న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కల్చరల్ బ్లాక్‌బస్టర్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ–''విజయ, వాహినీ, ఏవీఎం వంటి గొప్ప ప్రొడక్షన్ కంపెనీల్లో పని చేసిన అనుభవంతో చెబుతున్నాను.. నిర్మాతగా రూపేశ్ గొప్ప స్థాయికి వెళ్తాడు. ఇలాంటి పాత్రలు నా చివరి శ్వాస వరకు చేయాలనుకుంటున్నాను'' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ–''షష్టిపూర్తి'ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు'' అని తెలిపారు. ''షష్టిపూర్తి' లాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే నా లాంటి దర్శకులు, రూపేశ్ లాంటి నిర్మాతలు ఇంకా ముందుకు వస్తారు'' అన్నారు పవన్ ప్రభ. ఈ కార్యక్రమంలో కెమేరామేన్ రామ్, పాటల రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడారు.

డేంజర్ బాయ్స్


• వికాస్, రాధా

వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హసన్, రాఘవ్ కొడబాద్రి, మిథున్ తీర్థహల్లి ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'అపాయవీడి హెచ్చరిక'. అభిజిత్ తీర్థహల్లి దర్శకత్వంలో వి.జి.మంజునాథ్, పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రం కన్నడలో హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను యశస్విని క్రియేషన్స్, గీతా ఫిలిమ్స్‌పై శ్రీరంగం సతీష్ కుమార్ తెలుగులో 'డేంజర్ బాయ్స్' టైటిల్‌తో త్వరలో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్ట్‌లుక్‌ని, దర్శక–నిర్మాత సాయివెంకట్ టీజర్‌ను, నిర్మాత టి.రామసత్యనారాయణ– జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సత్య వర్ధన్ ఈ సినిమా పాటలను రిలీజ్ చేశారు.

తొలిప్రేమ తోపేం కాదు !


• శ్రీ గౌరీప్రియ, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'కలర్ ఫొటో, బేబి' చిత్రాల దర్శకుడు సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ గౌరీప్రియ హీరోయిన్. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుంది', 'తొలిప్రేమ అంత తోపేం కాదు' అంటూ కిరణ్ చెప్పే డైలాగులు గ్లింప్స్‌లో ఉన్నాయి.